హైదరాబాద్ వార్త



# భూగర్భ జలాలు అడుగంటుతున్నయ్..!

## గత ఏడాదితో పోలిస్తే ఈసారి భారీగా తగ్గిన లెవల్స్




**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈసారి బోర్లు ఎండిపోతున్నాయి. వానలు పడకపోతే మే నెలలో సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. గతేడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు పడిపోవడానికి కారణమని గ్రౌండ్ వాటర్ విభాగం అధికారులు చెబుతున్నారు. గడిచిన రెండు, మూడేండ్లతో పోలిస్తే ఈసారి గ్రౌండ్ వాటర్ భారీగా తగ్గిందని అంటున్నారు. భూగర్భ జలాలు గతేడాది. ఏప్రిల్‌తో పోలిస్తే హైదరాబాద్ జిల్లాలో 1.13 మీటర్లు, మేడ్చల్ జిల్లాలో 2.95 మీటర్లు కిందికి పడిపోయాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో 3.68 మీటర్లు తగ్గాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లిలో 16.60 మీటర్లు, ఇబ్రహీంపట్నంలో 9.78, హయత్‌నగర్‌లో 6.62 మీటర్ల లోతుకి గ్రౌండ్ వాటర్ పడిపోయింది. మేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లిలో 10.46. కూకట్ పల్లిలో 6.90 మీటర్లు, ఆసిఫ్‌నగర్‌లో 5.08, సైదాబాద్‌లో 2.53 మీటర్లు, చార్మినార్‌లో 2.34 మీటర్లు తగ్గాయి. వీటితోపాటు రాజేంద్రనగర్, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, బాచుపల్లి, బాలానగర్, కాప్రా, ఉప్పల్, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో గ్రౌండ్ వాటర్ తగ్గింది. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం నీటి ఎద్దడి కొనసాగుతోంది. కోర్ సిటీలో కొంత బెటర్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్‌లో గ్రౌండ్ వాటర్ కాస్త బెటర్ గా ఉంది. రంగారెడ్డి జిల్లాలోని 27 మండలాల్లో పరిశీలించగా, అంతటా గ్రౌండ్ వాటర్ తగ్గింది. మేడ్చల్ మల్కాజిగిరిలోని 15 మండలాల్లో 14 చోట్ల భూగర్భజలాలు పడిపోయాయి. ఒక్క అల్వాల్ మినహా అంతటా అడుగంటాయి. హైదరాబాద్ జిల్లాలోని 10 ప్రాంతాల్లో పరిశీలించగా, ఐదు చోట్ల మాత్రమే గ్రౌండ్ వాటర్ తగ్గింది. మాసబ్‌ట్యాంక్, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పురా, సైదాబాద్, చార్మినార్ ప్రాంతాల్లో గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈసారి గ్రౌండ్ వాటర్ తగ్గినట్లు తేలింది. హుమాయున్‌నగర్, చంద్రాయణగుట్ట, నల్లకుంట, హిమాయత్‌నగర్, నాంపల్లి ప్రాంతాల్లో 0.22 మీటర్ల నుంచి 4.65 మీటర్ల వరకు పెరిగింది. సగటున చూస్తే 1.13 మీటర్లు తగ్గినప్పటికీ ప్రాంతాల వారీగా చూస్తే కొన్ని చోట్ల భూగర్భ జలాలు పెరిగాయి. హైదరాబాద్‌లో గ్రౌండ్ వాటర్ ఎక్కువగా తగ్గకపోవడానికి కారణాలు చాలా ఉన్నాయి. కోర్‌సిటీలో ప్రధానంగా పెద్ద పెద్ద అపార్టమెంట్లు లేకపోవడం, ఇండివిడ్యువల్ ఇండ్లకు వాటర్ బోర్డు నుంచి సరఫరా జరుగుతుండడంతో బోరు వాటర్ వినియోగం తక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అపార్టుమెంట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం గ్రౌండ్ వాటర్ తగ్గింది. విచ్చల విడిగా బోర్లు వేసి గ్రౌండ్ వాటర్‌ని తోడేస్తుండడంతో ఈ సమస్య ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. గ్రౌండ్ వాటర్ పడిపోవడంతో నగరశివారు ప్రాంతాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా ట్యాంకర్ల పైనే ఆధారపడుతున్నారు. కొందరికి ఇండ్ల కిరాయి కంటే ట్యాంకర్ల ఖర్చు భారంగా మారుతోందని వాపోతున్నారు. శివారు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. వాషింగ్ మెషీన్లు బంద్ చేయాలని, బట్టలు ఉతికిన నీటిని వాష్‌రూమ్‌లో వాడుకోవాలని ఇండ్ల ఓనర్లు కండిషన్స్ పెడుతున్నారు. లేదంటే ఇండ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. బోడుప్పల్, నిజాంపేట, బండ్లగూడ జాగీర్, మణికొండ, నార్సింగి, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ ఇటువంటి సమస్య చూడలేదని స్థానికులు చెబుతున్నారు. చుట్టపక్కల అపార్టుమెంట్ల నిర్మాణం పెరిగినప్పటి నుంచి బోర్లు ఎండుముఖం పట్టాయని అంటున్నారు. వాటర్ ట్యాంకర్లు తెప్పించుకుంటున్నామని చెబుతున్నారు. వాటర్ బోర్డు ట్యాంకర్ కోసం ఐదారు రోజులు వేచి చూస్తున్నామని వివరిస్తున్నారు.



# జై శ్రీరామ్.. సంబురంగా శోభాయాత్ర

## రామనామస్మరణతో మార్మోగిన భాగ్యనగరం

**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

భాగ్యనగరం జై శ్రీరామ్ నినాదంతో మార్మోగింది. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం నగరంలోని ఆలయాలతోపాటు కాలనీల్లో శ్రీ సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అన్ని ఆలయాల్లో రాములోరి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం సీతారాంబాగ్‌లోని సీతారామ ఆలయం నుంచి 7 కిలోమీటర్ల మేర శ్రీరాముడి భారీ శోభాయాత్ర సాగింది.

జైశ్రీరాం నినాదాల నడుమ సీతారాం బాగ్ నుండి బోయిగూడకమాన్, దూల్‌పేట, మంగళ్ హట్, జాలీ హనుమాన్, పునారాపూల్, జుమ్మేరాత్‌బజార్, బేగంబజార్, రంగమహల్, గౌలిగూడ చమాన్, పుత్లీబౌలి, ఆంధ్రబ్యాంక్ చౌరస్తా మీదుగా సుల్తాన్‌బజార్ హనుమాన్ వ్యాయామశాల వరకు కొనసాగింది.

దారిపొడవునా భక్తులు జై శ్రీరామ్.. నినాదాలతో హోరెత్తించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని యాత్రను విజయ వంతం చేశారు. స్థానిక వ్యాపారులు స్వాగత వేది కలు ఏర్పాటు చేసి ప్రసాదాలు పంపిణి చేశారు. అంతకు ముందు సీతారాంబాగ్ ఆలయంలో గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అంబర్‌పేటలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపి వి.హనుమంతరావు, డాక్టర్ రోహిన్‌రెడ్డి, తదితరులు

## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న విహెచ్

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** శ్రీరామనవమి వేడుకల సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని వివిధ కళ్యాణమండపాల్లో జరిగిన వేడుకల్లో పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్ రెడ్డి, టిపిసిసి సెక్రటరీ శంభుల శ్రీకాంత్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, పార్టీ సీనియర్ నేత రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ రజక ధోబి మహాసంఘ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నవ్య నియామకం

**నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** అఖిల భారతీయ రజక ధోబీ మాహా సంఘ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రజక ధోబి మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా వీరేశం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా నియమించినందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి జూపల్లి సత్యనారాయణ, జాతీయ ఉపాధ్యక్షులు అమానపు అప్పారావు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుకలి శంకర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.




నియామక పత్రం అందుకుంటున్న నవ్య



హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో జీవించాలని, రామరాజ్యంవలే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ తాడ్‌బండ్ వీర హన్‌మాన్ దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లకు స్వాగతం పలికి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## దేశంలో అతి పెద్ద పార్టీ బిజెపి : ఎంపి ఈటల

**కంటోన్మెంట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో బిజెపి అంచెలంచెలుగా ఎదిగి దేశంలో అతి పెద్ద పార్టీగా ఆవిర్భావించిందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ సిఖ్ విలేజ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బిజెపి జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ 5 సూత్రాల సిద్ధాంతాలపై ఏర్పడిన బిజెపి దేశంలో మూడు సార్లు అధికారంలోకి రావడంతో పాటు 17 రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. తెలంగాణలో 35 శాతం ఓట్లు సాధించి 8 ఎంపీ సీట్లను కైవసం చేసుకుందున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాషాయం జెండాను ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంశా తిలక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదాకేశవరెడ్డి, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, అసెంబ్లీ కో-కన్వీనర్ మద్దెర్ల శ్యామ్ సుందర్, అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్, బిజెపి నాయకులు పరశరామ్, టోపీ శంకర్, పిట్ల నాగేశ్, నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాంతం కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

సిద్ధాంతం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బీజేపీ నగర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్‌తో కలసి ఆయన జెండా ఆవిష్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ ఆవిర్భావం తరువాత 1984లో మొట్టమొదటి సారిగా లోక్‌సభ ఎన్నికలలో పాల్గొని కేవలం రెండు స్థానాలను మాత్రమే కైవసం చేసుకోగా, నేడు అతి పెద్ద జాతీయ పార్టీగా రూపుదిద్దుకొని, కేంద్రంలో అధికారంలో ఉందని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతం ఆధారంగానే చిట్ట చివరి వ్యక్తికి కూడా ప్రయోజనం చేకూరాలనే ఆలోచనతోనే ఈరోజు బీజేపీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. సీనియర్ నేత గౌతంరావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఈ దేశం కోసం, ఈ సమాజం కోసం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, ఆనంద్‌గౌడ్, ఓ.శ్రీనివాస్‌రెడ్డి, కార్పోరేటర్ ఉమారమేష్‌యాదవ్, శ్యాంసుందర్‌గౌడ్, సందీప్‌సాయి, అనంతలక్ష్మి, కీర్తి రెడ్డి, వినోద్ యాదవ్, వనం రమేష్, సూర్య ప్రకాష్ సింగ్, రవీందర్, హరి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# ఉప్పల్‌లో ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ కోలాహలం..!

## తరలివచ్చిన అభిమానులు పటిష్ట బందోబస్తు

**ఉప్పల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌తో స్టేడియం బయట కోలాహలం నెలకొంది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన సన్‌రైజర్స్, గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ కోసం సాయంత్రం 4 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు స్టేడియం లోపలికి రావడం ప్రారంభించారు. రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభ సమయానికి ప్రేక్షకులు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికి గంట తర్వాత పూర్తిస్థాయిలో నిండిపోయింది. స్టేడియం లోపల మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయగా, స్టేడియంలోకి వచ్చే దారులను పోలీసులు మూసివేసి టిక్కెట్లు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. క్రీడాకారులు పెవిలియన్‌కు వచ్చే సమయంలో ఫోటోలు తీసేందుకు ప్రేక్షకులు పోటీ పడ్డారు. క్రికెట్ మ్యాచ్, శ్రీరామ నవమి సందర్భంగా పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఐపిఎల్ మ్యాచ్‌తో ఉప్పల్‌లో సందడి :**

ఐపిఎల్ మ్యాచ్ చూసేందుకు ప్రేక్షకులు అధికంగా తరలిరావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. అధికశాతం మంది కాంప్లమెంటరీ పాసుల కోసమే తంటాలు పడ్డారు. కేవలం తక్కువ రేటు ఉన్న టిక్కెట్లకు మాత్రమే డిమాండ్ ఉండగా, అధిక రేట్లు ఉన్న టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపలేదు. అదే విధంగా పలువురు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు కాంప్లమెంటరీ పాసులు పొంది తమ బంధువులు, అనుయాయులకు ఇచ్చారు. మరోవైపు పోలీసులు, ఇతర అధికారులు మధ్యాహ్నం నుంచే బందోబస్తులో ఉండడంతో రాత్రి వరకు నిరసించిపోయారు.




**పార్కింగ్ కోసం అవస్థలు :**

ఉప్పల్‌లో అంతర్జాతీయ హంగులతో నిర్మించిన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి సరైన పార్కింగ్ సదుపాయం కరువైంది. స్టేడియం లో మ్యాచ్‌లు జరిగిన సమయంలో స్థానికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. మ్యాచ్‌లు ప్రారంభం సమయంలో పలు ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేసుకోవచ్చని హెచ్‌సిఎ అధికారులు ప్రకటనలు జారీచేస్తున్నప్పటికి సంబందిత స్థలాల నిర్వహకులు వాహనాలు రాకుండా పెన్సింగ్ ఏర్పాటుచేసుకుంటున్నారు. స్టేడియంలో సుమారు 39 వేల మంది ప్రేక్షకులు కూర్చుని మ్యాచ్‌ను తిలకించే విధంగా నిర్మాణం చేయగా, వాహనాలు నిలిపేందుకు మాత్రం పార్కింగ్ సదుపాయం పూర్తిస్థాయిలో కల్పించలేదు. ప్రస్తుతం కేవలం విఐపిల వాహనాలు మాత్రమే లోపలికి అనుతిస్తుండగా, సాధారణ ప్రేక్షకుల వాహనాలు రోడ్ల వెంటే నిలిపి ఉంచుతున్నారు.



మ్యాచ్ చూడడానికి వచ్చిన జనసందోహం



స్టేడియంలో సందడి చేస్తున్న సినీనటుడు వెంకటేష్

# రియాల్టర్లకు రెవెన్యూ అధికారుల అండ

## సైబరాబాద్ కమిషనరేట్ సరసన మరో కబ్జా.. గజం రెండు లక్షల విలువైన భూమి గద్దలపాలు

**సైబరాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

ప్రభుత్వ భూములే లక్ష్యంగా శేరిలింగంపల్లిలో చెలరేగుతున్న రియల్ మాఫియాకు ఏకంగా రెవెన్యూ అధికార యంత్రాంగమే వంతపాడుతోంది. మియాపూర్, ఖానామెట్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైండు భూములు అన్యాక్రాంతమవుతుండగా వ్యవస్థల్లోని లోపాలను అడ్డుపెట్టుకొని అచేతనంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును ఆసరాగా చేసుకొని భూకబ్జాదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. తాజాగా గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌కు ఆనుకొనివున్న టెలికంనగర్‌లోని ప్రభుత్వ భూమిలో విలాసవంతమైన భవనం నిర్మించి అందులో అబ్బాయిలు అమ్మాయిలు కలిసేవుండే కో-లివింగ్ హాస్టల్‌ను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఈభవన నిర్మాణం విషయమై స్థానిక మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా మీనమేషాలు లెక్కిస్తున్న కారణంగా లక్షలాది రూపాయల అద్దెలు వసూలు చేసే అక్రమ భవనం ప్రారంభానికి సిద్ధమైంది.

అది శేరిలింగంపల్లి మండలంలోనే అతిపెద్దదైన గచ్చిబౌలి సర్వేనెంబరు 91కి చెందిన 480 ఎకరాల ప్రభుత్వ భూమి. ఈ స్థలంలోనే సైబరాబాద్ కమిషనరేట్, పుల్లెల గోపీచంద్ అకాడమీ, ఇన్ఫోసిస్, బ్రహ్మకుమారీస్, గోల్ఫ్‌కోర్స్, ఉర్దూ యూనివర్సిటీ, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్, ఐపిటిఆర్ఐ, నిథిమ్, జెఎన్ఐడిబి వంటి ప్రముఖ సంస్థలు నెలకొనివున్నాయి. దేశంలోనే పేరుగాంచిన సంస్థలన్నీ ఇక్కడే ఉండడంతో ఈ సర్వే నెంబరును ఆనుకొనివున్న ప్రైవేటు భూములకు కనీసం గజం రెండు లక్షల ధర పలుకుతోంది. ఇదే సర్వేనెంబరును ఆనుకొని ఉన్న ప్రైవేటు సర్వేనెంబర్లు 69,70లో గతంలో టెలికంనగర్ పేరిట ఒక అధికారిక లేఅవుట్ వెలిసింది. టెలికంనగర్‌కు ప్రభుత్వ సర్వేనెంబరు 91 మధ్యనున్న 9 ఎకరాల పైరెండు ప్రైవేటు సర్వేనెంబర్లలోని భూమిలో శంకర్‌లాల్ అనే వ్యక్తి 95వ సంవత్సరంలో ఒక అనధికారిక లేఅవుట్ వేశాడు. ఇక్కడ లేఅవుట్ వేసే సమయంలో అతను సర్వే నెంబరు 91లోని ప్రభుత్వ భూమిని సైతం లేఅవుట్‌గా మార్చి అమాయక ప్రజలకు ప్లాట్లను అంటగట్టాడు. ఆలస్యంగా మేల్కొన్న అప్పటి శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో వచ్చే ప్లాట్లను గుర్తించి వాటిచుట్టూ ప్రహారీగోడలు నిర్మించి బోర్డులు పాతారు. అప్పటికే కొన్ని ప్లాట్లలో అపార్టుమెంట్లు నిర్మితమవగా స్తోమతలేనివారు మాత్రం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి బలయ్యారు. సరిగ్గా ఇలాంటి అవకాశం కోసమే కాచుకొనివుండే ల్యాండ్ మాఫియా ఇక్కడ కూడా రంగంలోకి దిగి యధేచ్ఛగా తమ వ్యవహారాలను కొనసాగిస్తోంది. ఇక్కడ ప్లాట్లు కొని మోసపోయిన అమాయకులకు ఎంతోకొంత ముట్టజెప్పి సదరు ప్లాట్లను చేజిక్కించుకుంటారు. అనంతరం తమ పలుకుబడి, ధనబలంతో రెవెన్యూ అధికారులను లోబర్చుకొని యధేశ్చగా భవనాలను నిర్మించి ఈవ్యవహారం తెలియని అమాయకులకే తిరిగి అంటగడుతున్నారు.



సర్వేనెంబురు 91లోగల ప్రభుత్వ భూమిలో ప్రారంభానికి సిద్ధమైన కోలివింగ్ హాస్టల్

**'వార్త' కథనంతో గతంలో క్రిమినల్ కేసులు**

టెలికంనగర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణంచేపడుతున్న వ్యవహారంపై 2022 జూలై 6న 'వార్త' దినపత్రికలో ప్రధాన శీర్షికన వచ్చిన కథనంపై స్పందించిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. అప్పటి తహసీల్దారు ఆదేశాలమేరకు ఆర్ఐ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయగా కబ్జాదారునిపై క్రిమినల్ కేసు నమోదైంది. తాజాగా ప్లాట్ నెంబరు 192లో దాదాపు ఆరుకోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో భవనం నిర్మించి 'శ్రీలక్ష్మీనరసింహస్వామి' పేరుతో మన సంస్కృతికి తిలోదకాలిస్తున్న కో-లివింగ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయడం విడ్డూరంగా మారింది. ఆడామగా కలిసేవుండే ఈ హాస్టల్‌లో అన్ని సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన గదులను అందుబాటులో ఉంచడంతోపాటు ఉత్తర, దక్షిణ భారతదేశానికి చెందిన వంటకాలను మూడు పూటలా వడ్డిస్తామని బోర్డుపెట్టారు.

**చర్యలు తీసుకుంటాము:తహసిల్దార్**

ఈ వ్యవహారాన్ని శేరిలింగంపల్లి తహసిల్దార్ వెంకారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకొని బాధ్యులైనవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ప్రభాతవార్త ప్రతినిధికి వివరణ ఇచ్చారు.



శ్రీసీతారాముల కళ్యాణోత్సవానికి విగ్రహాలను తరలిస్తున్న పుష్పనగేష్

## కనుల పండువగా శ్రీసీతారాముల కళ్యాణోత్సవం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మందుముల శ్రీనివాస్‌నగర్ కాలనీలో శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. డివిజన్ ఆనవాయితీని అనుసరించి రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ నివాసం నుంచి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి సీతమ్మ, రామయ్య, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఆలయ కమిటి బాధ్యులతో కలిసి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని కళ్యాణ మహోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు.

## విజయ యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వీరహనుమాన్ విజయ యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తేదీన వీర హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే వీర్ హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సంగారెడ్డిలోని వైకుంఠపురం దేవాలయంలో ఆదివారం శ్రీ కందార్తె వరదాచార్యుల సమక్షంలో హిందూ సంఘాల బాధ్యులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల బాధ్యులు మాట్లాడుతూ 12న ఉదయం 10 గంటలకు పట్టణంలోని భవాని మాత మందిరంనుంచి విజయ యాత్ర ప్రారంభం అయి పట్టణంలోని పురవీధుల గుండా (కొత్త బస్టాండ్, బైపాస్‌రోడ్డు మీదుగా) శ్రీ వైకుంఠపురం దేవాలయానికి ఊరేగింపు చేరుకుంటుందన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) ఉంటుందన్నారు. విజయ యాత్రలో పార్టీలకు అతీతంగా హిందువులు పాల్గొని యాత్రను జయవంతం చేయాలని విహెచ్‌పి జిల్లా కార్యదర్శి ప్రకాష్, ఆర్‌ఎస్‌ఎస్ అధికారులు జగన్,, చంద్రశేఖర్, భజరంగ్ దళ్ బాధ్యులు లక్ష్మణ్, తరుణ్, సృజన్, అఖిల్, వెంకట్, భవానీ ప్రసాద్, బిజెపి పట్టణ అధ్యక్షులు ద్వారకా రవి, నాయకులు కసిని వాసు, దోమల విజయ్‌కుమార్, యశ్వంత్, శ్రీనివాస్‌రెడ్డి, ద్వారక శివ, తులసిరెడ్డి, లింగమూర్తి, ఏబివిపి నాయకులు కుమార్, ఆకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామ నవమి

**సదాశివపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆలయంలో మహిళలు అందంగా అలంకరించిన ఊయలలో శ్రీరాముడికి డోలారోహణం కార్యక్రమం పాటలు ఆలపిస్తూ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ నగర్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**న్యాల్‌కల్ మండలంలో...**



రామలింగేశ్వర ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవం దృశ్యం

**న్యాల్‌కల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు హద్నూర్, హుస్సేన్‌నగర్, శంశల్లాపూర్, రత్నాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. న్యాల్‌కల్‌లోని రామలింగేశ్వర, హద్నూర్‌లోని శ్రీఆంజనేయస్వామి, హుస్సేన్ నగర్‌లోని శ్రీరాముడి, శంశల్లాపూర్‌లో శ్రీ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగ సీతా రాములు కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. న్యాల్‌కల్‌లో బ్రహ్మణ పురోహితులు గిరిష్‌మహారాజ్, హద్నూర్‌లో అర్చకులు శివమూర్తి స్వామిలు వేద మంత్రాలు వల్లిస్తుండతా సీతారాముల కళ్యాణోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. న్యాల్‌కల్ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, భక్తులు మున్నూర్ అశోక్, పవార్ రామచందర్, బొడపల్లి బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**మనూర్ మండలంలో...**

**మనూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని హనుమన్ ఆలయానికి భక్తులు పూజలు నిర్వహించి శ్రీరాముడికి డోలారోహణం చేసి కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా జరుపుకున్నారు. ఆలయాలకు చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) వితరణ చేశారు. మండల కేంద్రమైన మనూర్‌లో నిర్వహించిన వేడుకలకు గ్రామ భక్తులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మనూర్ కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటి బాధ్యులు, గ్రామ యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**దామరగిద్దలో...**

**కంగ్టి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మచ్చేందర్‌ను అర్చకులు శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు గంగారాం, తడ్కల్, ర్యాలమడుగు మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీకాంత్, అమ్రే నాయక్, కృష్ణాపూర్, దామర్‌గిద్ద మాజీ సర్పంచ్‌లు కిష్టారెడ్డి, శంకర్, జిఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు బాలాజీ పాటిల్, మూర్కంజల్ బాలరెడ్డి, ఉప్పరి సాయిలు, సత్యనారాయణ, మనుమండ్లు, మారుతిరావ్, మహిపాల్‌రెడ్డి, దత్తురావు, రైతు సంఘం నాయకులు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మచ్చేందర్

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



కొమురవెల్లి అంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణం దృశ్యం



సలేంద్రిలో స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**నంగునూరు/చిన్నకోడూరు/కొమురవెల్లి/బెజ్జంకి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

శ్రీరామ నవమిని పురస్కరించుకుని నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక మండపాల్లో కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేదమంత్రోచ్చరణలు, శ్రీరామ జయ రామ నినాదాలతో హోరెత్తించారు. రాజగోపాల్‌పేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి పెండ్లి అధిక సంఖ్యలో భక్తులు హాజరైనారు.

**చిన్నకోడూరులో...**

చిన్నకోడూరు, నారాయణరావుపేట మండల్లాలోని అల్లీపూర్, మాచాపూర్, సలేంద్రి, అనంతసాగర్, రామునిపట్ల, జక్కాపూర్, చంద్లాపూర్‌లోని రంగ నాయకుల స్వామి గుట్టలో, చిన్నకోడూరు శేరిపల్లి హనుమాన్ దేవాలయంలో గుర్రాలగొంది తదితర గ్రామల్లో వేద మంత్రోచ్చారణల మధ్య పచ్చని పందిళ్ల కింద మంగళ వాయిద్యాలు మోగుతుండగా శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. రంగనాయకస్వామి దేవాలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో మాజీ జడ్పీ చైర్మన్ రోజా శర్మ, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు తండోప తండలుగా తరలివచ్చి కళ్యాణన్ని తిలకించి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కాగా గోనెపల్లి, చిన్న కోడూరులో నిర్వహించిన శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణమహోత్సవంలో వంగ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సలేంద్రిలో నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సం లో ఆలయ చైర్మన్ పానుగంటి నరసింహచారి, మాజీ ఎంపిటిసి పానుగంటి శారదరమేష్, అర్చకులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

కొమురవెల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శ్రీ రామన నవమి సందర్భంగా ఆదివారం శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయాలను అందంగా అలంకరించారు. శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వీక్షించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా అంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అలయ ఈవో రామాంజనేయులు, ఎఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, ఒగ్గు పూజారులు, అర్చకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని అయా గ్రామాల్లో రామనవమి ఉత్సవాలు కన్నుల పండుగగ జరిగాయి. మండల కేంద్రంతో పాటు తోటపల్లి, గాగిల్లాపూర్, దాచారం గ్రామాల్లో గల రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలో గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మన్నె కిరన్‌కుమార్

## రేషన్‌దుకాణాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

**చౌటకూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులోని రేషన్ దుకాణాన్ని శనివారం తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. సన్న బియ్యం పంపిణి ఎలా కొనసాగుతోందని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు రేషన్ దుకాణాన్ని తెరిచి ఉంచాలని తహసీల్దార్ రేషన్ డీలర్‌కు ఆదేశించారు. ప్రజలకు అందించే బియ్యం సంచులతో తూకం వేయకుండా బియ్యం మాత్రమే తూకం వేసి ప్రజలకు అందచేయాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా బియ్యం పంపిణి చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ డీలర్లకు హెచ్చరించారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి : బత్తుల మల్లేశం



చేబర్తిలో మహనీయుల చిత్రపటాలతో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**మర్కుక్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** గ్రామాల్లో ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ మండల ఇంచార్జ్ బత్తుల మల్లేశం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తండ కనకయ్యాగౌడ్‌లు అన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి గ్రామాల్లో మహనీయుల గురించి అవగాహన సదస్సు నిర్వహించి మహాత్మగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం మహనీయులు చేసిన సేవలను మరిచి కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను, బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. గ్రామ గ్రామాన ఎన్‌డిఏ కుట్రలను అడ్డుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, డాక్టర్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ర్యాకం యాదగిరి, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మొండి బిక్షపతి, పత్తి నర్సింలు, మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, కరుణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్, సూరి, ఉదయ్, కిషన్, నారంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెల్పుగొండలో ఘనంగా సీతారాముల కళ్యాణం

**టేక్మాల్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్పుగొండ, టేక్మాల్‌లతో ఆయా గ్రామాల్లో రామాలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణం, రామ పట్టాభిషేకం తదితర కార్యక్రమాలను కమనీయంగా నిర్వహించారు. శ్రీరాముడి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాముని ధర్మపరాయణత, నిజాయితీ, ప్రజల పట్ల ప్రేమ భక్తులు జీవితంలో అనుసరించాల్సిన అంశాలను వేద పండితులు వివరించారు. అలాంటి మహనీయుని కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలమన్నారు. సీతారాముల కల్యాణం కార్యక్రమం వైభవంగా సాగింది. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. రామానుజాచార్యుల సాంప్రదాయం ప్రకారం, వేద మంత్రాల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను వీక్షించారు.

## కంగ్టిలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**కంగ్టి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టితో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను భక్తి శ్రద్దలతో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన కంగ్టిలోని రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నవమి వేడుకలను నేత్ర పర్వంగా జరుపుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ గోవింద్ ప్రసాద్, అశోక్ మహారాజ్, అక్షయ మహారాజ్, కన్నా మహారాజ్, గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

**సిర్గాపూర్ మండలంలో...**

**సిర్గాపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని అతిపురాతనమైన రామాలయ స్థలంలో మామిడి ఆకులతో పందిరి వేసి శ్రీ రాముడి చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి డోలారోహణం చేశారు. వార్కారి సాంప్రదాయ పద్ధతిన శ్రీరాముల శోభాయత్ర నిర్వహించారు.

**అల్లాదుర్గం మండలంలో...**

అల్లాదుర్గం, ఏప్రిలన 6, ప్రభాతవార్త: మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండలంలోని ముస్తాపూర్, పెద్దాపూర్,ఇల్వర్ తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలోసీతారములు కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా జరుపుకున్నారు. ఆలయాలకు చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) నిర్వహించారు. అల్లాదుర్గంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా సీతారములు కళ్యాణోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో స్వామి వారిని పల్లకి సేవలో ప్రతిష్టించుకుని గ్రామంలోని పురవీధుల గుండా శోభా యాత్ర నిర్వహించారు.

## మైకోడ్‌లో గ్రామ సుభిక్షానికి హోమాలు

**మనూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** గ్రామం సుభిక్షంగా ఉండాలని మండలంలోని మైకోడ్ గ్రామంలో వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో హోమ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతి మాసం మొదటి ఆదివారం గ్రామ దంపతులచే హోమాలు నిర్వహించి భక్తులు ప్రసాద వితరణ (అన్నదానం) ఏర్పాటు చేస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన పోచారం సంగమేశ్వర్,శంకర్ దంపతులు యజ్ఞంలో పాల్గొని పూజా కార్యక్రమలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు : ఎస్ఐ

న్యాల్‌కల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిసి హద్నూర్ పోలీసులు సిసి కెమెరాలను ఏర్పాటు చేయించారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని హద్నూర్, ముంగి చౌరస్తా, గంగ్వార్ చౌరస్తా, రేజింతల్ గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఎస్ఐ చల్లా రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి సిసి కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చల్లా రాజశేఖర్ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయని, నేరం జరిగితే సిసి కెమెరాల సహకారంతో త్వరిత గతిన కేసును చేధించే అవకాశాలు ఉంటాయన్నారు. పోలీసు ఠాణా పరిధిలోని ఆయా గ్రామాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**సదాశివపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 46 మందికి ఎమ్మెల్యే రూ.10,89,500 రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దగొల్ల ఆంజనేయులు హరిఫోద్దీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లోడి వీరేశం, మాజీ ఎంపిపి తొంట యాదమ్మ కిష్టయ్య,మాజీ ఎంపిటిసి సభ్యులు మాధవరెడ్డి సునీత సుధాకర్,సంతోష్ గౌడ్, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్, మోబిన్ సాతాని, శ్రీశైలం, ఇంద్రమోహన్ గౌడ్, సమీ కలిం పటేల్, నసీరుద్దీన్,శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు నగేష్ పెద్దగొల్ల శ్రీహరి, సిద్దన్న నల్లల కుమార్ హనుమంత్‌రెడ్డి, మానేయ దాసు, మండల యూత్ అధ్యక్షులు నరేష్‌గౌడ్, బిసి సెల్ అధ్యక్షులు రవికుమార్, జిల్లా గొర్రె కాపరుల సంఘం మాజీ డైరెక్టర్ నగేష్ కురుమ, నాయకులు శేఖర్, చిన్న ఆరీఫ్, రమేష్, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, నిజం విజయ్ భరాడి శివ చంద్రశేఖర్,కాజా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**గజ్వేల్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని శ్రీమురళీ కృష్ణాలయం, కేసరి హనుమాన్ దేవాలయం, సత్యసాయిబాబా ఆలయం తోపాటు ప్రజ్ఞాపూర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం జరిగింది. ప్రజ్ఞాపూర్ కోదండరామస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు దేవతామూర్తులకు పురుషసూక్త అభిషేక పూజ, మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి ఎదుర్కోళ్ళు, అనంతరం సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో ఆలయ నిర్వాహకులు బండారు రాంమోహన్‌రావు, బండారు రాంఫణీందర్‌రావు, రాంప్రసాద్‌రావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పొద్దుటూరి విశ్వనాథం, శేఖర్, భాస్కర్, గోపిశెట్టి అశోక్‌కుమార్, పొద్దుటూరి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

**ములుగులో...**

**ములుగు, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు.ములుగులో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య కనుల పండుగగా నిర్వహించగా ఈ కళ్యాణ మహోత్సవంలో నాయకుడు కడపల నరసింహారెడ్డి దంపతులు కళ్యాణంలో కూర్చొని శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, పుస్తెమెట్టెలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహ ప్రసాదం అందజేశారు.

**హుస్నాబాద్‌లో...**

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త**

ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునుండే హుస్నాబాద్ పట్టణంలోని శివాజీనగర్ హనుమాన్ దేవాలయం, శ్రీ శివభక్త మార్కండేయ స్వామి సహిత సీతారామ ఆలయంరామాలయాల తోపాటు మండలంలోని పందిల్ల, పొట్లపల్లి దేవాలయాలలో భక్తులు వేకువ జామునుండే ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

అనంతరం సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు కన్నుల పండుగగా జరిపించారు.వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన శ్రీరాముల వారి కళ్యాణంలో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల జాయింగ్ కమిషనర్ ,అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ హాజరై స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించగా, శివాజీనగర్ హనుమాన్ దేవాలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆకుల రజితవెంకన్న పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం కళ్యాణానికి వచ్చిన భక్తులకు ఆయా దేవాల యాలలో అన్నదానం నిర్వహించారు.పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు.



మైకోడ్‌లో బిజెపి అవిర్భావదినోత్సవాన్ని జరుపుకుంటున్న పార్టీశ్రేణులు

## మైకోడ్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం

**మనూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మైకోడ్ గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని గ్రామంలోని పార్టీ కట్ట వద్ద భరత మాత చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి పార్టీ జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్ణం ఈశ్వరప్ప, బూత్ అధ్యక్షులు బీరప్ప, మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, శేరి సంగన్న, చెత్రి దత్తు, గాండ్ల సంజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**



అల్లాదుర్గంలో బిజెపి జండాను ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఆదివారం పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కాల రాములు ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకులు పార్టీ జండాను ఆవిష్కరించారు. మండలంలో పార్టీ బలోపేతానికి ఎవరికి వారు తమ వంతు కృషి చేయాలని కాల రాములు సూచించారు. కార్యక్రమంలో బిజెవైఎం మండల అధ్యక్షులు వడ్ల బాలరాజ్, కోశాధికారి మంగళ అశోక్, ప్రధాన కార్యదర్శి వడ్ల రమేష్ కుమార్, బూత్ ఇంచార్జి వడ్ల దుర్గేష్, బూత్ అధ్యక్షులు వి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**వర్గల్‌లో...**

**వర్గల్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని శక్తిగా అవిర్భవించినట్లు వర్గల్ మండల బిజెపి అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వర్గల్ మండలకేంద్రంలో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి, ఉపప్రధాని లాల్‌కృష్ణ అద్వానీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీ 1980లో బిజెపి ఆవిర్భవించగా, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ అసలు మూలాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హిందూ సాంస్కృతిక, సాంప్రదాయాల పరిరక్షణ, దృఢమైన జాతీయ రక్షణ భావజాలం, మెజారిటీ హిందూ వర్గాల ఐక్యత, జాతీయ సమైక్యత అధికారం తమ లక్ష్యం కాదని, దేశ ప్రజలపై హిందూయేతరుల దాడిని తిప్పి కొట్టడమే ధ్యేయమని చెప్పారు. కేవలం 3 పార్లమెంట్ స్థానాల నుండి ప్రస్థానం ప్రారంభించిన బిజెపి మూడవ పర్యాయం ఢిల్లీలో అధికారం చేపట్టి పేద, బడుగు, బలహీన, మైనార్టీ, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తామని వివరించారు.కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీకాంత్, నేతలు మణికంఠ, బద్రీనాథ్, వెంకటేష్, బుచ్చిరెడ్డి, నాగరాజు, యశ్వంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సాయి, సంపత్, రాజు పాల్గొన్నారు.

**గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో...**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, సీనియర్ నాయకులు జశ్వంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 18,19 వార్డుల్లో నాగు ముదిరాజ్, బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో బిజెపి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిపించుకొని మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. దానికి కార్యాచరణ రూపొందించుకొని ఇప్పటి నుండే మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**మర్కుక్‌లో...**

**మర్కుక్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** బిజెపి 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మర్కుక్‌లో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సింగం సత్తయ్య హాజరై మాట్లాడుతూ బిజెపితోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి హవా కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కమిటీ సభ్యులు రమేష్‌గుప్త, మండల ఉపాధ్యక్షుడు కొమురయ్య, బిజెవైఎం అధ్యక్షుడు పంజ మధు, కోశాధికారి మహేందర్, ప్రధాన కార్యదర్శి కుంట సత్యం, మర్కుక్ మాజీ ఎంపిటిసి చైతన్య శంకర్‌రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ కిషోర్‌రెడ్డి, కాశిరెడ్డి మాజీ సర్పంచ్ స్వరూప మల్లేశం, నాయకులు క్రాంతికుమార్, తుమ్మ ఐలయ్య, లక్ష్మీనరసింహా, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి సీతారాములకు అభిషేకం

**గజ్వేల్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త):** శ్రీరామనవమి శుభ సందర్భంగా గజ్వేల్‌లోని శ్రీ రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం 50 కోట్ల లిఖిత శ్రీరామ నామాలతో అద్దాల మందిరంలో కొలువైన శ్రీసీతారాములకు ప్రత్యేకంగా అభిషేకించి అలంకరించారు. అనంతరం రామనామ స్మరణతో ప్రాంగణం మారుమ్రోగింది. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ రామనామ స్మరణ చేస్తే ఆనందం లభిస్తుందని, ఆ నామంలో ఉన్న మంత్రశక్తి మనలో దుఃఖాన్ని సమూలంగా నాశనం చేసి ఆనందాన్ని ఇస్తుందన్నారు. రామకోటి రాయని వారు శ్రీరామనవమి నుండి ప్రారంభించాలని ఈ సందర్భంగా కోరారు.

## పార్టీలో కష్టపడి పని చేస్తే గుర్తింపు లభిస్తుంది

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఇటీవల జిల్లా ఆర్టీఏ సభ్యులుగా నియామకమైన డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ హైదారాబాద్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కారించారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ తెలిపినట్లు తెలిపారు. పార్టీలో దశాబ్దాల కాలంగా కష్టపడి పని చేసిన వర్మ కుటుంబానికి గుర్తింపు లభించిందన్నారు. రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



బాబు జగజ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

## బాబు జగజ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు

**నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 21 డివిజన్ సాయినగర్‌లో దళిత సంఘం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జలగం చంద్రయ్య, రామ నరసయ్య ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ఎన్ఎంసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబశివారెడ్డి మిత్రులతో కలిసి జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, చంద్రయ్య, కురుమూర్తి, బలరాం, సుధాకర్, సమర్ ఖాన్ పాల్గొన్నారు.

### జగజ్జీవన్ రామ్ ప్రజానాయకుడు : దాసి నాగరాజు



డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ నివాళులర్పిస్తున్న దాసి నాగరాజు

**నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని రాజీవగాంధీనగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు కార్యకర్తలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసి నాగరాజు మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ ఆశయాలు, ఆచరణలు నేటికీ ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న శ్రీ వెంకట శివరామాలయ వార్షికోత్సవం

**నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో శ్రీవెంకటశివ రామాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త స్థాపిత దేవత పూజలు, శాంతి పౌష్టిక మంత్ర హావనములు, కల్యాణ హోమములు, శ్రీదేవి భూదేవి సహిత జయది హోమం, పూర్ణాహుతి, శ్రీదేవి భూదేవి సహిత శ్రీవెంకటేశ్వర స్వామి వారికి అష్టోత్తర కలశ శివ పంచాయతనములకు అష్టోత్తర కళాశా శ్రీ హనుమాన్ సీతా లక్ష్మణ సహిత శ్రీ రామచంద్రమూర్తికి సహస్ర కలశ అభిషేకము, అలంకరణ,హారతి పూజలు నిర్వహించడం జరిగింది.

### నేటి నుంచి మహా కుంభాభిషేకం : నర్సారెడ్డి

**కంటోన్మెంట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ శివాజి నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీపెరుమాల్ వెంకటేశ్వర దేవాలయంలో నేటి నుంచి 11వ తేదీ వరకు మహా కుంభాభిషేకం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వై.నరా స్రెడ్డి, ఈఓ సత్యమూర్తిలు తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 200 సంవత స్రాల చరిత్ర కలిగిన ఆలయాన్ని ఏడాదిన్నర కాలంలో జీరో ద్ధరణ చేసినట్లు తెలిపారు. పనులు పూర్తైనందు వల్ల ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ వేడుకలకు పరమహంస, శ్రీశ్రీశ్రీ శతగోప రామానుజ పెద్ద జీయర్, జిన్న జీయర్ స్వాములు పాల్గొనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు వంగ నరేశ్, కసిరెడ్డి, అజయ్ యాదవ్, రాయ్ వెంకటేశ్, మంద సురేశ్, కె.శ్రీనివాస్ రెడ్డి, అంజనేయులు యాదవ్, గోవిందన్,ప్రధాన అర్చకులు సారథి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఠాకూర్ అమర్ సింగ్

**మెహిదీపట్నం, ఏప్రిల్ 6, ప్రభాత వార్త :** భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం కార్వాన్ డివిజన్ లో ఘనంగా జరిగాయి. క్రాంతి భవన్ వద్ద ఆ పార్టీ కార్వాన్ డివిజన్ అధ్యక్షులు ఉద్దడి జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఠాకూర్ అమర్ సింగ్ పాల్గొని పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీలో క్రమశిక్షణగా ఉంటూ పార్టీ కోసం నిరంతర పనిచేసే కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు, శివ రత్నం, మాజీ రాష్ట్ర యువా మోర్చా ప్రధాన కార్యదర్శి పడాల అనంతకృష్ణ, కార్వాన్ డివిజన్ కాంటెస్టెడ్ కోర్పరేటర్ కట్ల అశోక్, కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి గిరిధర్, డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ గంజి రగునాథ్, శ్యామ్ లింగం, డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి భరత్, ఓబీసీ మోర్చా అద్దెక్షులు సిరాందాస్ గోపాల్, దళిత్ మోర్చా అద్దెక్షులు సాంబ శివ రావు, ఉపదేక్షులు నరేష్ జాదవ్, ఉపదేక్షులు మోర్ వెంకటేష్, కార్యదర్శి మోర్ అశోక్, కార్యదర్శి భాను చందర్, యువా మోర్చా నాయకులు అరుణ్, యువా మోర్చా అద్దెక్షులు గోవిందా, యువా మోర్చా ఉపదేక్షులు అభిషేక్ లు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌నగర్‌లో బిజెపి జెండావిష్కరణ

**అడ్డగుట్ట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో బిజెపి సీనియర్ నేత చిన్న వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిజెపి జెండాను మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

### ప్రముఖ విద్యావేత్త గరికపాటి వెంకటరామయ్య

**సైఫాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరామనవమి పండువను పురస్కరించుకుని ప్రముఖ విద్యావేత్త గరికపాటి వెంకటరామయ్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అన్ని దానాల్లో కంటే అన్నదానం గొప్పదని, పస్తులతో ఉండే పేదల అకలి దప్పులు తీర్చేందుకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి సమాజం అదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పర్వదినాల్లోనైనా కనీసం నిరుపేదలకు అకలి తీర్చి వీలైతే ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టున్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, దయామణి, జకిర, పిలిక తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుభాషా మాధుర్యాన్ని కాపాడుకోవాలి

### ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి

**నాంపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** తెలుగుభాష, మాధుర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ళ భరణి అన్నారు. నేటి శ్రీవిశ్వావసు ఉగాది పురస్కార గ్రహీతలంతా స్వశక్తిమీద ఎదిగి ఇంత గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందిన ప్రజ్ఞావంతులని కొనియాడుతూ శుభాశీస్సులందజేశారు. ప్రముఖ సంస్థ అక్షజ్ఞ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళా మందిరంలో వివిధరంగాల్లోని ప్రముఖ మహిళామణులకు శ్రీవిశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వావసు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం సంస్థకు చెందిన విద్యావెంకట్, ప్రముఖ కార్టూనిస్టు బ్నిం నిర్వహణలో వైభవోపేతంగా జరిగింది. ప్రతీ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని సంస్థ అందిస్తున్న ప్రతిష్టాత్మక విశిష్ట మహిళా పురస్కారాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రముఖ సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి, దూరదర్శన్ వ్యాఖ్యాత విజయదుర్గ, ప్రఖ్యాత నాట్యకళాకారిణి పి.వి. భారతి, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ, హాస్యానందం రాజు, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ వై.ఎస్. శ్రీనివాస్, కృష్ణారావు తదితరులు ప్రముఖ నటి ఝాన్సీ, రచయిత్రి కుప్పిలి పద్మ, గాయని ఉపద్రష్ట సునీత, నర్తకి కాట్రగడ్డ హిమాన్షి, జర్నలిస్టు స్వప్న, కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మిలను ఘనంగా సత్కరించి విశ్వావసు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఎంతగానో అభినందించి శుభాభినందనలు తెలిపారు.... సంస్థ సేవలను కొనియాడారు.



పురస్కారగ్రహీతలతో తనికెళ్ళభరణి, లంక, శ్రీనివాస్, విజయదుర్గ తదితర అతిథులు



నల్లకుంటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## నల్లకుంటలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** నల్లకుంట డివిజన్ మయూరి లేన్, స్ట్రీట్ నెంబర్ నాలుగులో రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ఇప్పటికే డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించినట్లు తెలిపారు. గత ఆరు సంవత్సరాలలో నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట తదితర డివిజన్‌లలో గల బస్తీలు, కాలనీలలో అవసరమైన అన్ని ప్రాంతాలలో నూతన డ్రైనేజీ వ్యవస్థను రూపొందించినట్లు పేర్కొన్నారు. అలాగే మంచినీటి పైప్ లైన్ వ్యవస్థను కూడా ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. నూతన రోడ్లు నిర్మించడమే కాకుండా పార్కులు సుందరీకరించడం, వాన నీటి పైప్ లైన్‌లను కూడా మార్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మయూరి సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు బి. ప్రమోద్ కుమార్, పి. పరిమల్ రావు, ఎస్. రామ్ జగదీష్, ఆర్. రామ్మోహన్, ఎస్. రాఘవేంద్ర, ఎస్. శ్రీకాంత్, ఆర్. రామ్మోహన్, జేపీ వరదరాజు, స్థానిక బిజెపి నాయకులు మధుసూదన్ యాదవ్, ప్రశాంత్ జోషి, కే లక్ష్మణ్, కేజే బాబు, కిషోర్ కుమార్, మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### పూజల్లో పాల్గొన్న నమ్రత

**కంటోన్మెంట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 5వ వార్డు కాకగూడ, బాలంరాయి, ఏడబ్ల్యుహెచ్ఓ కాలనీలో జరిగిన ఎసీతారాముల కళా ్యణ మహోత ్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సాయన్న కూతురు జి.నమ్రత పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు గజ్జెల గోపాల్, త్యాగరాజు, చిన్నా, కె.బి.శంకర్‌లు పాల్గొన్నారు.

## చిరంజీవి హాస్పిటల్లో హైబ్రిడ్ వ్యాస్క్యులర్ చికిత్సలు

**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతార్త :** అత్యాధునిక హైబ్రిడ్ వ్యాస్క్యులర్ చికిత్సలను చిరంజీవి హాస్పిటల్లో అందిస్తున్నారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న రోగులకు హైబ్రిడ్‌చికిత్సలందించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. కేపీహెచ్‌బి కాలనీలోని చిరంజీవి హాస్పిటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ సంజీవరావు మాట్లాడుతూ యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్, ఓపెన్ సర్జరీలను అత్యాధునిక నైపుణ్యంతో సంయుక్తంగా నిర్వహించడాన్ని హైబ్రిడ్ చికిత్సగా పిలుస్తామని వివరించారు. సిద్దయ్య అనే పేషెంటుకు ఉదార పొట్ట భాగంలో డీవీటీ సమస్య కారణంగా గతంలో వేరే హాస్పిటల్ నందు ఐవీసీ ఫిల్టర్ అమర్చారు. అయితే, కొద్ది రోజుల తర్వాత ఆ ఫిల్టర్ పక్కకు జరిగి పేగులోకి వచ్చి చేరింది. తత్ఫలితంగా పేషెంట్ భరించలేనంత నొప్పితో బాధపడుతూ ఉన్నాడు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సిద్దయ్యకు హైబ్రిడ్ విధానంలో పేషెంట్ మెడ భాగం ద్వారా ఫిల్టరును తొలగించగలిగాం. మరో కేసులో, ఫకీరా అనే వ్యక్తి కాలిపై భాగంలో రక్తనాళం పూర్తిగా మూసుకుపోయింది. అందువల్ల పేషెంట్ విపరీతమైన నొప్పితో బాధపడుతుండేవాడు. పేషెంటుకు హైబ్రిడ్ టెక్నాలజీతో చిన్న కోతతో యాంజియోప్లాస్టీ స్టెంటింగ్ తో పాటు థ్రాంబెక్టమీ చేశాం. ఈ చికిత్సతో పేషెంట్ కాలిని తీసెయ్యకుండా కాపాడటమే కాకుండా అతడు మామూలుగా నడవగలిగేలా చేయగలిగాం. తెలుగు రాష్ట్రాల్లో మరెక్కడా ఈ చికిత్సలు నిర్వహించలేదని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యులు డాక్టర్ లీనా, డాక్టర్ కె. వంశీకృష్ణ, డాక్టర్ శిల్ప, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.




ఆరోగ్యశ్రీ సేవలతో హైబ్రిడ్ వ్యాస్క్యులర్ చికిత్సలు నిర్వహించిన వైద్యులు




గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న గుజ్జ సత్యం

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** బంధాలు బంధుత్వాలు కుటుంబ విలువల గురించి పిల్లలకు నేర్పించాలని సత్యం టెక్నో స్కూల్ చైర్మన్ గుజ్జ సత్యం అన్నారు. పెద్దఅంబర్‌పేట్‌లోని సత్యం టెక్నో హైస్కూల్లో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యం టెక్నో హైస్కూల్ చైర్మన్, బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, ప్రొఫెసర్ డా. వెంకటరాజయ్య, సామాజికవేత్త బొమ్మ రఘురాం నేత, ప్రిన్సిపల్ అరవింద్ బాబు వరుణ్ నెక్స్ జెన్ స్కూల్ డైరెక్టర్ జెల్లా వెంకటేష్, ప్రిన్సిపాల్ సౌజన్య, జెల్లా నరేందర్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. చిన్నారులు ఆటలు, పాటలతో అందర్నీ అలరించారు. చిన్నారులు డాక్టర్, లాయర్, పోలీస్ రైతు, తదితర వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జ సత్యం మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు క్రమశిక్షణ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని, ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అపార అవకాశాల్ని వుడిసి పట్టుకొని అద్భుతమైన విజయాలు సాధించడానికి చదువు ఒక్కటే మార్గమని క్రమశిక్షణ కలిగిన చదువు ద్వారా గొప్ప విద్యార్థులుగా మారి గొప్ప లక్ష్యాలను చేదించడం ద్వారా జీవితంలో తద్వారా కుటుంబాన్ని సమాజాన్ని దేశాన్ని ప్రపంచంలో అత్యంత స్థాయిలో నిలబెట్టవచ్చున్నారు. ప్రిన్సిపల్ అరవింద్ బాబు మాట్లాడుతూ పిల్లలు తరగతి గదిలో ఎలా ఉండాలో తెలియజేశారు టీచర్లు చెప్పింది శ్రద్ధగా వినడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : కొత్త సంజీవరెడ్డి

**కంటోన్మెంట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** అధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్టీసి మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి తెలిపారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మహేంద్ర హిల్స్‌రవి కాలనీలోని షిరిడి సాయిబాబా సంస్తానం దేవాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించార. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గజ్వెల్ భరత్, నాగిరెడ్డి, బిజెపి నాయకులు అజయ్ యాదవ్, రవి కాలనీ, ప్రతినిధి ఛీఫ్ ఇంజనీర్ సంపత్ కుమార్ తదితరుల పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### పహాడి హన్‌మాన్ దేవాలయంలో సీతారాములు కళ్యాణం

**అడ్డగుట్ట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పహాడి హన్‌హన్‌మాన్ దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అభివృద్ధి పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి నక్క మధు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు బిఆర్ఎస్ యువనేత టీ.రామేశ్వర్ గౌడ్, అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు శాలువకప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆర్.శ్రీరాములు, ఎస్.వెంకటేశ్, శివకుమార్, బి.క్రిష్ణ, షిరిడి సాయిబాబా హై స్కూల్ కరస్పాండెంట్ ఎల్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## హిందువుల ముఖ్య పండుగ శ్రీరామ నవమి

### కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్

**కంటోన్మెంట్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

హిందువులకు ముఖ్య మైన పండుగ శ్రీరామ నవమి అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సీతారాముల కళా ్యణ మహోత ్సవాన్ని పురఃస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లిలోని సీతారాంపూర్ కాలనీ రాజధాని సొసైటీ, నందమూరి నగర్, న్యూ సిటీ కాలనీ, జయనగర్, చిన్న తోకట్ట పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన సీతారాముల కళా ్యణ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నాగరాజు, నవీన్, సాయిబాబా యాదవ్,రాము, ముఖేశ్ యాదవ్, జగన్నాధం, శ్రీనివాస్ రెడ్డి, శంకరయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సైకాలజిస్టులు సమాజ మానసిక ఆరోగ్యానికి రక్షకులు

**సైఫాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

సైకాలజిస్ట్‌లు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ సమాజంలో మారుతున్న మానసిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు చేయడం అత్యవసరమని తెలంగాణ రా ష్ట్ర సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ చెప్పారు. సత్యనారాయణరెడ్డి భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో మానవ సంబంధాలు, చీలికలు, జీవనశైలి వేగం, ఉద్యోగ వత్తిడీలు, వ్యక్తిగత సమస్యలు, మానసిక సమస్యలు మానసిక ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సైకాలజిస్ట్‌ల పాత్ర మరింత కీలకమైనదని, అలాగే రాష్ట్రంలో సైకాలజిస్ట్ రంగానికి గౌరవ తీసుకురావడానికి ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని, సమాజానికి మరింతగా చేరువు అయ్యేలా కార్యాచరణను రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో సైకాలజీలకు సంబంధంలేని విద్యార్హతలతో కొందరు కౌన్సిలర్లుగా నియమించబడుతున్నారని ఆరోపించారు. సోషియల్ వర్క్ లేదా సామాజిక శాస్త్రం చదివిన వారు మానసిక కౌన్సిలింగ్ సేవలు అందించడమంటే ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవడమేనన్నారు. సమాజంలో వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలాలు మానసిక స్థితిలో ఉంటాయని, విద్యార్థులు భావోద్వేగ సమస యలు. వివాహితుల దాంపత్య సమస్యలు, వృద్దులు ఒంటరి తనాన్ని అధిగమించడంలో మార్గ నిర్దేశం చేయడం వంటి బాధ్యతలు ఉద్యోగులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్, వ్యసనాల నివారణ, ఆత్మహత్య యత్నాలు వంటివి సమస్యలతో బాధపడుతున్నవారికి అవగాహన కల్పించడం సైకాలజిస్ట్‌ల బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో వేముల సధాకర్, బి.నారాయణరావు, రాజు ఆచార్య, డా.శశికిరణ్, సౌజన్య, వసుంధర తదితరులు పాల్గొన్నారు.




చెర్లపల్లి కొంపెల్లా లయన్స్ డయాలసిస్ సెంటర్‌కు 6 హెమో డయాలసిస్ యంత్రాల ఈసీఎల్‌కంపెనీ విరాళంగా అందిస్తున్న దృశ్యం

## విద్య,వైద్య సేవలకు ఈసిఐఎల్ ముందుంటుంది

### ఈసీఐఎల్ సంస్థ డైరెక్టర్ టెక్నికల్ అశోక్ కుమార్‌శర్మ

**కుషాయిగూడ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన వైద్యం అందుకోలేని నిరుపేద మధ్యతరగతి ప్రజల కోసం, ప్రతిభావంతులైనప్పటికీ ఉన్నత విద్యకు చేరుకోలేని నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సహించడానికి ఈసీఐఎల్ సంస్థ విధులు కేటాయించడానికి ఎల్లప్పుడూ ముందుంటుందని ఈసీఐఎల్ సంస్థ డైరెక్టర్ టెక్నికల్ అశోక్ కుమార్ శర్మ పేర్కొన్నారు. చర్లపల్లిలోగల కొంపెల్ల లయన్స్ డయాలసిస్ సెంటర్(కేఎల్‌డిసిక) ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) సంస్థ 2025 ఆర్థిక సంవత్సరానికి గాను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) కార్యక్రమంలో భాగంగా డయాలసిస్ ఖరీదైన యంత్రాలను, టెక్నికల్ డైరెక్టర్ అశోక్ కుమార్ శర్మ, కే ఎల్ డి సి చైర్మన్ లయన్ హరీష్ రెడ్డికి అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసిఐఎల్ సంస్థ సంస్థ లాభార్జన తో పాటు సామాజిక బాధ్యతగా తమ కంపెనీ ద్వారా కోట్ల రూపాయలు ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ వైద్యశాలలు స్వచ్ఛంద సంస్థలకు సైతం నిధులను ప్రతి సంవత్సరం మంజూరు చేస్తూ సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నామన్నారు. ప్రజలకు భారీ ఎత్తున ఉపయోగపడే సేవా ప్రాజెక్టులను తమ దృష్టికి తేవాలని ఈ సెల్ డైరెక్టర్ టెక్నికల్ అశోక్ కుమార్ కోరారు. కే ఎల్ డి సి చైర్మన్ , డిస్టిక్ 320 సి మాజీ గవర్నర్,, డైనోటెక్ పరిశ్రమల అధినేత కే .హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఈసీఐఎల్ లాంటి సంస్థ మూలంగా నిరుపేద ప్రజలకు ఆధునిక ఖరీదైన వైద్యం అతి తక్కువ ధరలకే అందే అవకాశం ఏర్పడిందన్నారు. డిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ ఇన్నారెడ్డి, పిజిడిలు భాస్కర్ రెడ్డి, కృష్ణమూర్తి, రెడ్డప్ప రెడ్డి, స్థల దాత అమ్మన్న శాస్త్రి , కే ఎల్ డి సి జాయింట్ సెక్రెటరీ డాక్టర్. లక్ష్మీ మూర్తి, హ్యూమన్ రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. మురళీధర్, డాక్టర్ పి వేణుబాబు చీఫ్ మెడికల్ ఆఫీసర్ లు పాల్గొన్నారు.

### నేతాజీనగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించాలి

### కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్లు



ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

**కంటోన్మెంట్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** కంటోన్మెంట్ 1వ వార్డు నేతాజీ నగర్‌లో ఖాళీగా ఉన్న కంటోన్మెంట్ బోర్డు స్థలంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను నిర్మించేందుకు నిధులు కెటాయించాలని, కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించే విధంగా కేం ద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, సదాకేశవరెడ్డి, మాజీ బోర్డు మెంబర్లు పాండు యాదవ్, లోకనాధం, అనితా ప్రభాకర్, నళిని కిరణ్‌లు కలిసిసి ఎంపీ ఈటెలకు వినతిపత్రం అందజేశారు.

### ఉత్తమ విద్యాబోధనతోనే నాలుగు దశాబ్దాల ఘనచరిత్ర: కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** కార్మికవాడలలో నిరుపేదల పిల్లలకు నాలుగు దశాబ్దాలుగా విద్యాబుద్ధులు నేర్పిస్తున్న గుడ్‌షఫర్డ్ హైస్కూల్ ద్వారా వేలాదిమంది నిరుపేదలు విద్యావంతులయ్యారని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం శ్రీనివాసనగర్ లోని గుడ్‌షఫర్డ్‌హైస్కూల్ 40వ వార్షికోత్సవానికి ఆయన పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పాల్గొని ప్రసంగించారు. గుడ్‌షఫర్డ్స్ పాఠశాలలో విద్యాబోధనతో పాటు తల్లిదండ్రులు కూడా వారిపిల్లల భవిష్యత్ కోసం ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. వేలాది మంది నిరుపేదలకు ఉచితవిద్యను అందించడంతో పాటుస్థానికంగా నిరంతరం శ్రమించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కలలను తీర్చిన గురువుగా కరుణానిధి ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. కార్యక్రమంలో గుడ్‌షఫర్డ్‌హైస్కూల్ కరస్పాండెంట్ కరుణానిధి, జయరాం, శ్రమశక్తి అవార్డుగ్రహీత, ఎంఆర్‌పిఎస్ నాయకులు రవిందర్, శ్రీనివాసనగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు నర్సింగరావు, సలహాదారు పి.గోపాల్, శ్రీహరి, రవిందర్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

సీతారాముల కళా ్యణ మహోత ్సవాలను పురస్కరించుకొని ఆదివారం బాలంరాయిలోని శ్రీదేవి దండుమారెమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్, కాంగ్రెస్ నాయకులు దర్గ రవి, క్రిష్ణ, శ్రీనివాస్, నాగరాజు, రమేశ్‌లు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM IX M.M. COURT AT MEDCHAL**
**O.S.No: 21 OF 2025**

**Between:**
Mumtaz Noorani W/o Late Sultan Bhai Noorani, aged 68 years, Occ: Housewife, R/o Rose-B, G10, Garden Housing Society, Kompally, Mandal: Gandimaisamma-Dundigal, District: Medchal-Malkajgiri- 500100
Nurani Samir Ali Sultanali S/o Late Sultan Bhai Noorani aged 49 years, Occ: Private employee 2-4-844/C Nallagutta, Ramgopalpet, Secunderabad 500003. Presently R/o 319, North Decatur Lane, Park Summit apartment, Decatur GA 30033 USA, Atlanta, Mobile: +1786-547-8343
**...Plaintiffs**
**AND**
The Tahsildar/MRO, Mandal: Gandimaisamma-Dundigal, District : Medchal-Malkajgiri- 500100
All concerned
**...Defendants 1&2**
WHEREAS the Plaintiffs have filed the above Suit to declare the plaintiffs as legal heirs of Late MR SULTAN BHAI NOORANI, The said suit is posted to 29.04.2025 for your appearance. You are hereby required to appear on that day at 10.30 a.m. either in person or through a pleader, failing which the matter will be decided as per law.
**//BY ORDER OF THE COURT//**
**VIJAY KUMAR**
Advocate, Medchal
**Mobile No. 8520922171 / 9440235231**
e-mail:vjsinghal@rediffmail.com

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI COURTS, AT MALKAJGIRI**
**O.S.No. 944 of 2022 (New)**
**O.S.No. 765 of 2017 (Old)**
Between:
**Canara Bank, JSN Colony Branch,** Medchal-Malkajgiri **...Plaintiff**
And
**M/s VSR Chicken and Fast Food and another ...Defendant-1**
To
**1. M/s VSR Chicken and Fast Food,** rep by its Sole Proprietor: Sri T. Ravinder Goud S/o Sri T. Jangaiah Goud, aged about 41 years, Occ: Business, R/o H.No. 2-4-1053/41/1, New Samathapuri Colony, Road No.4, Nagole, Hyderabad (Medchal-Malkajgiri)-500035.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.7,26,389/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **16th April 2025, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI COURTS, AT MALKAJGIRI**
**O.S.No. 934 of 2022 (New)**
**O.S.No. 192 of 2019 (Old)**
Between:
**Canara Bank, Uppal Branch,** Medchal-Malkajgiri **...Plaintiff**
And
**Sri Sathi Reddy Dharna ...Defendant**
To
**Sri Sathi Reddy Dharna** S/o D. Narasimha Reddy, aged about 47 years, R/o H.No.7-7-8-1-1, Parvathi Nagar, Peerzadiguda, Hyderabad (Medchal-Malkajgiri)-500039. Ph No.9886212873.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.5,24,814/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **16th April 2025, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI COURTS, AT MALKAJGIRI**
**O.S.No. 751 of 2022 (New)**
**O.S.No. 722 of 2018 (Old)**
Between:
**Canara Bank, Uppal Branch,** Medchal-Malkajgiri **...Plaintiff**
And
**Sri L. Ravikoteswara Rao ...Defendant**
To
**Sri L. Ravikoteswara Rao** S/o L. Koteswara Rao, aged about 47 years, R/o H.No.4-3-1/3, Ward No.18, Erukala Basti, Nacharam, Uppal, R.R. Dist., (Medchal-Malkajgiri).
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,76,299/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **16th April 2025, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**



మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహా

## న్యాయమైన పోరాటాల్లో సిపిఐ శ్రేణులు ముందంజలో ఉండాలి : నర్సింహా

**సైఫాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** అన్ని న్యాయమైన పోరాటాల్లో సిపిఐ శ్రేణులు ముందంజలో ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా పిలుపునిచ్చారు. నేడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు పెరుగుతున్న మతతత్వం, ద్వేషమని, దీంతో రాబోయే పోరాటాలు కష్టతరంగా ఉంటాయని, శతాబ్దం చరిత్ర కలిగిన కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తితో ఎదుర్కొనాలని సూచించారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యుడు ఎం.డి. సలీం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇ.టి.నర్సింహామాట్లాడుతూ ప్రజల ఆందోళనలను కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం విస్మరించి దేశ ప్రజలను మతం ప్రాతిపదికన విభజించటానికి తీవ్రంగా కుట్రలు పన్నుతున్నదని, ఈ దుర్మార్గపు మతతత్వ శక్తుల కుట్రలను తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ఏజెండా అమలులో భాగంగా మోదీ తీసుకునే ప్రతి నిర్ణయంలో రాజ్యాంగ నిర్వీర్యానికి, ప్రజాస్వామ్య పతనానికి స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ తిరుగమన నిర్ణయాలతో ప్రాథమిక హక్కులు కాలరాయబడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ నగరంలోని ప్రతి బస్తీలో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు కమతం యాదగిరి, స్టాలిన్, ఎం.నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

### తుల్జభవన్‌లో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం



శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న నీతా రాజ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** కాచిగూడలోని తుల్జభవన్ ధర్మశాలలో శ్రీరామనవమి పురస్కరించుకుని శ్రీసీతారామచంద్ర ఆలయంలో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో భవన్ కుటుంబ వ్యవస్థాపక సభ్యురాలు నీతా రాజ్‌కుమార్ ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె 3వేల మంది భక్తులకు అన్న ప్రసాదాల వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో భవన్ సలహా మండలి సభ్యులు సిద్ధయ్య, గంగాధర్, అరవింద్, జయేంద్రభూపతి, శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు నర్సింహులు, వ్యాసమూర్తి తదితరులు కళ్యాణ మహోత్సవానికి ఏర్పాటు చేయగా దేవాలయం కార్యనిర్వాణాధికారి అంజనారెడ్డి, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. కాచిగూడ పోలీస్ స్టేషన్ సిఐ జ్యోత్స్న, డిఐ సురేష్‌బాబు, ఎస్ఐలు సుభాష్, నరేష్ బందోబస్తు నిర్వహించారు.

**టిటిడిలో...**

**సైఫాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరామనవమిని పురస్కరించుకుని హిమాయత్‌నగర్‌లో టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీసీతారాముల వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. కళ్యాణ మండపాన్ని అందంగా అలంకరించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో వందలాది మంది జంటలతోపాటు ఆనేక మంది భక్తులు పాల్గొని తిలకించారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీసీతారాముల వారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం శ్రీసీతారాములు కళ్యాణ మహోత్సవం కార్య క్రమం ప్రారంభమైంది. మేళ తాళాలు, సన్నాయి సంగీతం, డప్పు వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వారి కళ్యాణం అంగ, రంగ వైభవంగా సాగింది. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం చూడా ముచ్చటగా సాగింది. భక్తులకు పూజారులు శ్రీసీతారాముల దర్శనంతోపాటు తలంబ్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదాలు, పానకం, వడపప్పు వితరణ గావించారు. అలాగే నిత్యం కొనసాగుతున్న మాదిరిగానే నేడు అన్నదానం వితరణ కొనసాగింది. భక్తులకు టిటిడి ఎఈఓ రమేష్, ఉద్యోగులు శ్రీనివాస్ ప్రభు, మణికంఠ, లక్ష్మిపతి, దాతలు రామిరెడ్డి, బాలశంకర్‌రెడ్డి, అరవింద్, బాలాజీ భవన్ భక్తుల సొసైటి అధ్యక్షుడు రామకృష్ణంరాజు, శ్రీవారి సేవకులు విశేషమైన సేవలు అందించారు.

## మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కేటాయించాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** సమాజంలో బలహీన వర్గాల మహిళలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటున్నారని ఓబిసి సెంట్రల్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి ఆరోపించారు. మహిళా బిల్లు అమోదం కోసం రెండు దశాబ్దాలుగా జాతీయ బిసి మహిళా సమాఖ్య ఉద్యమించి విజయం సాధించిందని చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఓబిసి మహిళా విభాగం కమిటి రాష్ట్ర అధ్యక్షురాలిగా డా.పోశం సునీతను నియమించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళా బిల్లులో కేంద్రం బిసి,ఎస్సీ,ఎస్టీలకు మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లుకోసం ఉద్యమించింది ఎస్సీ,ఎస్టీ,బిసి మహిళలని, రిజర్వేషన్‌లు మాత్రం అగ్రవర్ణాలకు ఇస్తే ఎలా అని ఆమె ప్రశ్నించారు. తక్షణమే తమకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. పోశం సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబిసిల హక్కుల కోసం పోరాడుతానని చెప్పారు. పంచాయితీ నుంచి పార్లమెంట్ వరకు అన్ని రంగాలలో బిసి మహిళలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. అన్ని శాఖలలో అభివృద్దిని సాధించాలని, రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు చిన్నయ్య, పరమేష్, సుజాత, శిరీష, శ్రీనిధి, ధానకర్ణాచారి, గుజ్జ కృష్ణ, పద్మగౌడ్, మమత తదితరులు పాల్గొన్నారు.

### శోభాయమానం సీతారాముల శోభాయాత్ర

**మెహిదీపట్నం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** సీతారాముల శోభాయాత్ర శోభాయమానంగా కొనసాగింది. రామలక్ష్మణ్ జానకి.. జై బోలో హనుమాన్ కి అంటూ భక్తులు, యువకులు పెద్ద ఎత్తున నినదించడంతో కార్వాన్ పుర వీధులని రామనామ స్మరణతో మారుమ్రోగాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కేసరి హనుమాన్ యువ సంఘటన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీతారాముల శోభాయాత్ర కన్నుల పండుగగా కొనసాగింది. మొదటగా కేసరి హనుమాన్ దేవాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు నిర్వాహకులు. శోభాయాత్రలో భజన మండలి ఆధ్వర్యంలో బజనలు నిర్వహించగా కేసరిహనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ఆంధ్రుని కార్వాన్, రాంసింగ్ పుర, ఆర్య సమాజ్, కార్వాన్, ఉప్పర బస్తి, దర్బార్ మైసమ్మ దేవాలయం పురవీధుల గుండా శోభయాత్రను నిర్వహించారు. యాత్రలో భక్తులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు గంజి రఘునాథ్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సీతారాముల శోభ యాత్రను నేత్రపర్వంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక బస్తీల ప్రజలు, భక్తులు, యువకులు శోభయాత్రలో పాల్గొని విజయవంతం చేశారన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న యువకులు



శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవాల్లో కోట నీలిమ



హరిదాస మండపం వద్ద ఎమ్మెల్యే మర్రి



శ్రీవీరహనుమాన్‌దేవాలయంలో శ్రీసీతారాముల కళ్యాణం



ఉస్మాన్‌గంజ్‌లో విగ్రహాలను తీసుకెళుతున్న దృశ్యం

# భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

**మెహిదీపట్నం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** శ్రీసీతారాముల కళ్యాణ వేడుక భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ వేడుకల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కళ్యాణ వేడుకను కనులారా తిలకించారు. కార్వాన్ నియోజకవర్గంలోని జియాగూడ, కార్వాన్, గుడిమల్కాపూర్, లంగర్ హౌస్ డివిజన్ ల లోని పలు బస్తీలు, కాలనీలలో కొలువుదీరిన దేవాలయాలలో సీతారాముల కళ్యాణ వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామాలయాలు రామనామ స్మరణతో మారు మ్రోగాయి. కార్వాన్ కేసరి హనుమాన్ దేవాలయంలో, ఆళ్లగడ్డ హనుమాన్ దేవాలయం, హీరా నగర్‌లోని రామాలయం, విశ్వేశ్వర్‌నగర్‌లోని రామాలయం, గుడిమల్కాపూర్ బాలాజీ నగర్ లో, ఉప్పర బస్తి బాలాంజనేయ దేవాలయం, శివ భాగ్ గాయత్రీ నగర్, రామ్‌సింగ్ పుర బాలాజీ మందిర్ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కళ్యాణ వేడుక అనంతరం దేవాలయాల నిర్వాహకులు ప్రసాద వితరణ గావించారు.

**అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌లలో...**

**సంజీవరెడ్డి నగర్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** అమీర్‌పేట డివిజన్‌లోని ధరంకరంరోడ్డు గంగుబాయ్ బస్తీ బైటప్ క్వార్టర్స్ లలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావ్, నాయకులు అశోక్‌యాదవ్, సంతోష్, మణికుమార్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్ట బలరాం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సనత్ నగర్ డివిజన్‌లోని 7 టెంపుల్స్ లో నిర్వహించిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా జెక్‌కాలనీ, సిటైప్ క్వార్టర్స్, సుందర్ నగర్, ఉదయ్ నగర్ కాలనీ, రవిందర్ నగర్, భగత్‌సింగ్ పార్కులలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ కార్పోరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి, డివిజ్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి, పియూష్ గుప్తా, గోపాల్‌రెడ్డి, జెక్ కాలనీ ప్రతినిధులు సుబ్బరాజు, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పలు ఆలయాల్లో పూజలు చేసిన కోట నీలిమ**

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరామ నవమి సందర్భంగా సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి సభ్యురాలు, సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు.

**రెనోవా నీలిమ ఆసుపత్రిలో...**

**సంజీవరెడ్డినగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** సనత్ నగర్ డివిజ్‌లోని రెనోవానీలిమ ఆసుపత్రి నిర్వాహకులు నిర్వహించిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవంలో రేనోవ నీలిమ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి, శ్రీధర్, సిఒఒ డాక్టర్ రవింద్రనాథ్‌లు కుటుంబ సమేతంగా పాల్గొని వేద పండితుల అధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణ వేడుకలను కన్నులారా వీక్షించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాధా క్రిష్ణ, సిఈఓ బల్బీ స్పెషాలిటీ పి.నీలిమ, హెచ్ఓడి గైన కాలజీ డాక్టర్ ఆర్.జె.వి.ఎస్. సాయి మహదేవ్, జిఎం.రామ్ సుబ్బారెడ్డి, శివసుబ్రమణ్యం, శ్రీవల్లి, డాక్టర్ మసూద్, రఘునాథ్, కిషోర్ పాల్గొన్నారు.

**ఉస్మాన్‌గంజ్‌లో...**

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** ఉస్మాన్‌గంజ్‌లోని పోటాటో, గ్లారిగిన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా మాదిరిగానే ఈఏడు శ్రీసీతారామా కళ్యాణోత్సవాన్ని పచ్చటి పందిరిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహాల ఎదుర్కొళ్లను మేళా తాళాల మధ్య ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఈకార్యక్రమంలో క్యాతం రాధాకృష్ణ, నరేందర్, సి.పరమేశ్వర్, శశికాంత్, ఆనంద్, మురళీ, ప్రదీప్‌ఓరా, గోపాల్‌లు పాల్గొన్ని సీతారామ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

**వివేకనందనగర్ కనకదుర్గ దేవాలయంలో...**

**పురానాపూల్, ఏప్రిల్ 6ప్రభాతవార్త:** శ్రీరామ నవమి పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా స్వామివివేకనందనగర్ కనకదుర్గమ్మ దేవాలయం ఆవరణ ముందు చూడ ముచ్చటగా కొనసాగింది.సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఆలయ పూజారి సంతోషచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచర్చణ మధ్య నిర్వహించారు.బస్తీవాసులు కుటుంబసమేతంగా తరలివచ్చి తలంబ్రాలను సమర్పించారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎంపి.సదానందన్,పి.శ్యామ్‌కుమార్,ఆలయ కమిటి ప్రతినిధులు పి.నాగేష్, మహేందర్, ప్రభాకర్, శ్వేత, దాతలు పి.గోపాల్, ప్రేమ్‌కుమార్, కొన్నింటిశివ కుమార్, సుధాకర్, నందకుమార్, గురుచరణ్ వందలాది మంది భక్తులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు.

**శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత..**

**బేగంబజార్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని దూల్‌పేటలో నిర్వహించిన శ్రీరామ పల్లకిసేవాలో కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పల్లకిసేవాను ఆనంద్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గడ్డం ఆశిష్‌కుమార్‌యాదవ్, పప్పుసింగ్ మాత్రే పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో...**

**కుత్బుల్లాపూర్‌జోన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాలు జైశ్రీరామ్ నామ స్మరణతో మారుమోగాయి. ఆయా కాలనీల్లో శ్రీసీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగా వైభవంగా, కనుల పండువగా నిర్వహించారు. యువత జైశ్రీరామ్ అంటూ ర్యాలీలు చేశారు. సందడి జరిగిన కళ్యాణోత్సవం వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులైయ్యారు. కళ్యాణం అనంతరం అన్నసమారాధన చేశారు.కళ్యాణోత్సవంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కళ్యాణోత్సవం అనంతరం డప్పు చప్పులు, కోలాటాలతో ఊరేగింపులు చేసి సంబురాలు జరుపుకున్నారు. పలువురు మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలు చేసిన శ్రీసీతారాముల పవిత్రబంధం అజరామరమైనదని, సత్యధర్మ పాలనకు ఆదర్శనీయులు అన్నారు. స్వామివారి ఆశీస్సులతో అందరూ బాగుండాలని అభిలషించారు.

**చింతల్ రంగానగర్‌లో...**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిచారు. చింతల్ రంగానగర్ శ్రీసీతారామాంజనేయా స్వామి దేవాలయంలో కాలనీ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవానికి రంగానగర్ కాలనీ నుండేకాక చుట్టు పక్కల బస్తీలు, కాలనీలనుండి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగానగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా మాట్లాడుతూ వారంరోజులుగా ఆలయంలో కళ్యాణమహోత్సవ ఏర్పాట్లను యావత్ సంక్షేమ సంఘ ప్రతినిధులు అందరూకలిసి నిర్వహించడం ద్వారా భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటైనట్లు తెలిపారు.

**కమనీయంగా రాములోరి కళ్యాణం....**

**బేగంపేట ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** శ్రీరామ నవమి పురస్కరించుకొని ఎస్పీరోడ్డు శ్రీవీరహనుమాన్ దేవాలయంలో సీతారాముల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పూలు వివిధ రకాలైన విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సీ.బద్రీనాథాచార్యులు కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఉదయం నుంచే భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.స్వామివారి కళ్యాణోత్సవానికి జంట నగరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో నిండిపోయింది. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేసారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసారు.

**అల్వాల్‌లో...**

**అల్వాల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** అల్వాల్‌లో రాములు వారి కళ్యాణం రమణీయంగా కనులపండుగలా జరిగింది. కాలనీలు, బస్తీలులో శ్రీరామ నవమి ఉత్సాహం అడుగడుగునా కనపడింది. దేవుని అల్వాల్ హరిదాస మండపం వద్ద జరిగిన రాములు వారి కళ్యాణోత్సవానికి అతిరధులు విచ్చేశారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంబిటి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో పురజనులు కళ్యాణోత్సవాన్ని తిలకించి పరవశితుల య్యారు. సీతారామ నామ సంకీర్తన సంఘం ఆధ్వర్యం లో 74వ శ్రీ సీతారామ వసంత నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సంఘం అధ్యక్షుడు కందకట్ల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరాంకుశం మాధవీల ఆధ్వర్యంలో ఉత్సవాలు సాగుతున్నాయి. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని హైటెన్షన్ లైన్, ఎంహెచ్ఆర్ కాలనీ, కౌకూర్ ప్రాంతాలులో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలలో స్థానిక కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పాల్గొన్నారు.

### లక్ష్మీగణపతి ఆలయంలో వైభవోపేతంగా కళ్యాణోత్సవం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని పవిత్రమైన శ్రీ లక్ష్మీగణపతి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనీల్ కుమార్‌యాదవ్, డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ తదితరులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారి శెట్టి నర్సింగరావు, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జై శ్రీరాం..జైజై శ్రీరాం వంటి భక్తిపారవశ్యమైన నినాదాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. ఈ కార్యక్రమంల ఆలయం కమిటీ సభ్యులు జె.శివకుమార్, ఎం.రాజేష్, డి.భానుచందర్, జి.భాగ్యలక్ష్మి, వి.సాయికీర్త్, గరిబాబు, గుర్రం దినేష్, బి.నవీన్ కుమార్, పి.సురేష్‌యాదవ్, జి.గజానంద్, ఎం.గణేష్, జి.లలిత, ఎ.రామ కృష్ణ, జి.శ్రీనివాస్, కె.శివకుమార్, సిహెచ్.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

### రాములోరి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ లోని సిద్ధంశెట్టి అపార్ట్మెంట్స్ లో అసోసియేషన్ మెంబర్స్ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ నరేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు బసవరాజు, ప్రధాన కార్యదర్శులు జితేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు రామారావు, బిఆర్ఎస్ నేతలు ముఠా నరేష్ , పుచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### సీతారామకళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట ఏప్రిల్ 6,ప్రభాతవార్త**

శ్రీరామనవమి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ లోని కేసరిహనుమాన్ దేవాలయం,భగవంతాపూర్ లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీసీతారామచంద్రుల కళ్యాణ మహోత్సవంలో తలసాని పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీజీరోడ్డులోని కృష్ణనగర్ కాలనీలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. పూజల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి,డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,నాయకులు డి.వి.నరేందర్‌రావు, శ్రీహరి, శేఖర్, ఆరిఫ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గాంధీనగర్‌లో శ్రీరామనవమి వేడుకలు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**

ముషీరాబాద్ నియోజకవర్గ గాంధీ నగర్ డివిజన్‌లో శ్రీరామ నవమి సందర్భంగా బీజేపీ సీనియర్ నేత గాదె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీత కళ్యాణ మహోత్సవంలో రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి. గాంధీనగర్ స్ట్రీట్ నో 12 లో జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమని ప్రారంభించారు. కాసేపు అక్కడే ఉంది ప్రసాదాన్ని స్వీకరించి కళ్యాణానికి విచ్చేసిన భక్తులందరితో ముచ్చటించారు. ఆమెతో పాటు బీజేపీ యువ నాయకుడు దోనేటి సత్యం, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, నాయకులు దామోదర్, లక్ష్మీనారాయణ(బంటి) పాల్గొన్నారు.

### భారతదేశాన్ని ప్రపంచపటంలో నిలిపిన ఘనత ప్రధాని మోడీదే : రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీనగర్ డివిజన్ బూత్ నెంబర్: 271,272 అశోక్ నగర్ సర్కిల్ లో పార్టీ జెండాను రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. 1980 లో స్థాపించిన బీజేపీ పార్టీ ఆశయాలు,సిద్ధాంతాలకు లోబడి మన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ పది సంవత్సరాలలో ఆశయాలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్తున్నారని, ప్రధానంగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఆర్టికల్ 370, ట్రిపుల్ తలక్ రద్దు, అయోధ్య రామ మందిర నిర్మాణం, ఇటీవల వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం లాంటి ప్రతిష్ఠాత్మక నిర్ణయాలతో బీజేపీ పార్టీ ద్వారా భారత దేశాన్ని ప్రపంచదేశాల్లో అగ్రగామిగా నిలబెట్టరాన్నారు. నాయకులు,కార్యకర్తలు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భారత్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్,బూత్ అధ్యక్షులు సురేష్ సీనియర్ నాయకులు రత్న సాయి చంద్,శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, శివ కుమార్,సత్తి రెడ్డి,ప్రకాష్ యాదవ్, మహమూద్, శ్రీనివాస్, నర్సింహ, సాయి కుమార్, లక్ష్మణ్ యాదవ్, యాదగిరి, నీరజ్, సత్యేందర్, జి డి రాజు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ పిల్లలకు స్కూల్ బాగ్స్ కిట్స్ పంపిణీ

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** బిజెపి అడిక్మెట్ డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీనఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక అంగన్వాడీ పిల్లలకు స్కూల్ బాగ్స్ కిట్స్ పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరై పంపిణీ చేశారు.కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండాగోని భరత్ గౌడ్, స్థానిక నేతలు, లక్ష్మణ్‌రావు, విన్ను మూదిరాజ్, కిషోర్, జనార్ధన్‌రెడ్డి, శేషసాయి, రాజకుమార్, ప్రదీప్, శోభాఠాకూర్, కుమారి, లక్ష్మినారాయణ, ఎంసి.మోహన్,నరేశ్, చిరంజీవి, సత్యనారాయణ, బాబు, గోపాలదాసు, చంద్రశేఖర్, జగదీష్, సంగం బాలరాజ్ పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** అశోక్‌నగర్ నగర గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయంలో భారతరత్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లైబ్రరీ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూజీ అని ముద్దుగా పిలువబడే బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమానత్వం ప్రముఖ ఛాంపియన్. అణగారిన వర్గాల, ముఖ్యంగా దళిత సమాజం, అభ్యున్నతికి ఆయన జీవితాంతం అంకితభావం భారతదేశ సామాజికరాజకీయ దృశ్యంపై చెరగని ముద్ర వేసిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్, డైనమిక్ అడ్మినిస్ట్రేటర్ పాత్రను నొక్కి చెప్పారు. రక్షణ, వ్యవసాయం, కార్మిక సహా వివిధ మంత్రిత్వ శాఖలకు ఆయన చేసిన గణనీయమైన సహకారాన్ని వారు గుర్తుచేశారు. సామాజిక న్యాయం పట్ల బాబూజీ నిబద్ధతపై దృష్టి సారించి, కుల ఆధారిత వివక్షను నిర్మూలించడానికి, సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడానికి ఆయన కృషి చేశారన్నారు.

### 24వ తేదీ నుంచి సంగీతంలో శిక్షణ

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో 24వ తేదీ నుంచి మే 24వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులను నిర్వహించబోతున్నట్లు అకాడమి వ్యవస్థాపక డైరెక్టర్ జి.వసుధామూర్తి, వ్యవస్థాపక ప్రిన్సిపాల్ జి.లక్ష్మణమూర్తి వివరించారు. ఇతర వివరాలకు 8374927736 సంప్రదించవచ్చన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్నమయ్య కీర్తనలు,రామదాసు కీర్తనలు, భజన్‌లు, మంగళహారతులు, ఇతర ఆధ్యాత్మిక పాటలు, కీబోర్డు, ప్లానో, బేసిక్స్, సాంగన్స్, భజన్‌లలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కాగా మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 617వ అన్నమయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించబోతున్నట్లు వివరించారు.

### నేత్రపర్వంగా రాములోరి కల్యాణం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** భద్రాచలం తర్వాత అంతటి మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతున్న నగరంలోని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణమహోత్సవ వేడుక కనుల పండువగా సాగింది. అయోధ్యానగరాధిపతి దశరథ మహారాజు ప్రథమ పుత్రుడు రామచంద్ర స్వామికి మిథిలా నగరాధిపతి జనకమహారాజు పుత్రి సీతామహాదేవిని ఇచ్చి వేదపండితులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి తదితరుల ఆధ్వ ర్యంలో కల్యాణక్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పసుపు కొట్టుట, పసుపుల ముహూర్తం, తలంబ్రాల మేళన, ఎదుర్కోలు వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. పద్మావతి, నిర్మల, ముక్క రామకృష్ణ, వెన్నెల కంటి వెనకాల శివ కుమార్, మురికి గణేష్, నన్ను కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**గాజులరామారంలో...**

**జీడిమెట్ల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** గాజులరామారం గ్రామంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి కూన క్రిష్ణా, మహాలక్ష్మి ఛారిటబుల్‌ట్రస్టు చైర్మెన్ కూన శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పాల్గొన్న వేలాదిమంది భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన స్వయంగా వడ్డించి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ చిత్తారమ్మ ఆలయకమిటీ చైర్మెన్ కూన అంతయ్యగౌడ్, రాచకొండ బాల్‌రాజ్, అమురి ఇంద్రసేనగుప్తా, డి.ఇంద్రసేనారెడ్డి, వేంసాగర్, నరేశ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రమేష్, యాదగిరి, శ్రీహరిలు పాల్గొని భక్తులకు అన్నాదానం నిర్వహించారు.

# మంచి జీవనశైలితో పరిపూర్ణ ఆరోగ్యం



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

**ముషీరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్రతి ఒక్కరూ మంచి జీవనశైలి పద్ధతులను పాటించాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. ఏప్రిల్ 7వ తేదీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యంగా జీవించటం ఎలా అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపించబడిన రోజు కావటంతో ఈరోజును ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా నిర్వహించుకుంటామని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని, జీవన నాణ్యతను పెంచుకోవాలని తెలియచేయటమే దీని ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎవరైనా ఆరోగ్యంగా జీవించాలంటే కొన్ని చిట్కాలు పాటించాలని తెలిపారు. శరీర పనితీరు సక్రమంగా ఉండాలంటే ప్రతి రోజూ తప్పకుండా ఎనిమిది గ్లాసుల మంచినీరు తాగాలని, సమతుల ఆహారం ప్రతి పూట తీసుకోవాలని, శరీరానికి తగినంత వ్యాయామం తప్పకుండా ఉండాలని సూచించారు. అదే విధంగా మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని, కనీసం రోజుకు ఎనిమిది గంటలు నిద్ర పోవాలని, మద్యం, ధూమపానం వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. మన శరీరం, మన పరిసరాలు, మనం తీసుకునే ఆహారం పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని, శారీరక ఆరోగ్యం పైనే కాకుండా మానసిక ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని, దీని కోసం సామాజిక బంధాలు చాలా అవసరమని, రోజులో కొద్ది సేపు ఒంటరితనం మంచిదే కానీ, ఎక్కువ సమయం కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో గడపటం ద్వారా మానసిక ఆనందం పొందవచ్చునని సూచించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ, మన లైఫ్ స్టైల్‌లో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే ఎక్కువ కాలం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చునని వివరించారు.